ప్రజాశక్తి

సోమవారం 25 డిసెంబరు 2023

5

శ్రీకాకుళం

27న మూలపేట పోర్టు సందర్శన

ప్రజాశక్తి- నరసన్నపేట

సంతబొమ్మాళి మండలం మూలపేటలో రూ.4362 కోట్లతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణ పనులను జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య ప్రజాప్రతినిధులతో కలిసి వైసిపి సమన్వయకర్త వై.వి.సుబ్బారెడ్డి పరిశీలించనున్నారని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం పదిన్నర గంటలకు ప్రజాప్రతినిధులు అక్కడకు చేరుకొని కోర్టు నిర్మాణ పనుల పరిశీలన అనంతరం అక్కడే విలేకరుల సమావేశంలో మాట్లాడతారన్నారు. మధ్యాహ్న భోజన అనంతరం అక్కడ నుంచి ఇటీవల సిఎం పలాసలో ప్రారంభించిన కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు చేరుకుని అక్కడ రోగులకు అందుతున్న సేవలను స్వయంగా అడిగి తెలుసుకుంటారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కృష్ణదాస్ కోరారు.

శ్రీకాకుళం అర్బన్ : కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు

హామీలు అమలు చేసే వరకు

సమ్మె విరమించేది లేదు

- ప్రభుత్వ ద్వంద వైఖరి విడనాడాలి
- నాగావళి నదిలో అంగన్వాడీల జలదీక్ష
- 13వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె
- జిల్లాలో కొవ్వొత్తుల ర్యాలీ

కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు ఆధ్వర్యాన శ్రీకాకుళం జిల్లాలో అంగన్వాడీలు చేపట్టి సమ్మెబాట ఆదివారానికి 13వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసే వరకూ సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. సమ్మెకు పలు కార్మిక, ప్రజాసంఘాలతో పాటు తెలుగుదేశం పార్టీ, సిపిఎం మద్దతు తెలిపాయి.

ప్రజాశక్తి- జిల్లా విలేకరుల యంత్రాంగం

రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలపై వ్యవహరిస్తున్న ద్వంద్వ వైఖరి విడనాడి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ ఆదివారం యూనియన్ ఆధ్వర్యాన శ్రీకాకుళం నగరంలోని నాగావళి నదిలో కార్యకర్తలు జలదీక్ష చేస్తూ వినూత్నరీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల సెంటర్ల తాళాలు పగలకొట్టమని సచివాలయ ఉద్యోగుల చేత పనిచేయిస్తూ మరోవైపు సమస్యల పరిష్కారానికి సానుకూలం ఉన్నామని ప్రకటించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. మంత్రులు ఉషశ్రీచరణ్, బొత్స సత్యనారాయణలు అంగన్వాడీలను ముందు విధులకు హాజరుకమ్మని చెప్పడం, మూడు నెలల్లో సమస్యలను పరిష్కారిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. చర్చలు అంటూనే మరోవైపు వాలంటీర్లకు, సచివాలయ ఉద్యోగులకు తాళాలు పగుల గొట్టమని ఆదేశాలివ్వడం, ఐసిడిఎస్ విధుల నిర్వహణ బాధ్యతలు అప్పగించేందుకు చేస్తున్న ప్రయత్నాలు రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని అన్నారు. ఈ చర్యలను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నిరంతరం ప్రజల ఆరోగ్య భద్రత కోసం శ్రమ పడే అంగన్వాడీలకు వేతనాలు పెంచడానికి, గ్రాట్యూటీ చెల్లించడానికి డబ్బులుండవా? అని ప్రశ్నించారు. లబ్ధిదారులకు ప్రభుత్వంపై వ్యతిరేకత తగ్గించడానికి హడావుడిగా సిబ్బందిని సమకూర్చే పనిచేస్తోందని అన్నారు. తద్వారా ప్రీస్కూల్ నిర్వాహణ దెబ్బతింటోందన్నారు. పిల్లల ఆలనా పాలనా చూడడం అంగన్వాడీలు తప్ప మరెవ్వరు చూడలేరని గుర్తించాలని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి.రాజేశ్వరి, కె.ప్రమీలాదేవి, ఇ.అప్పలనరసమ్మ, కృష్ణభారతి, సుశీల, నాగపద్మ, మల్లేశ్వరి, దమయంతి పాల్గొన్నారు. టెక్కలి ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిర్వహించిన నిరవధిక సమ్మెకు సిఐటియు నాయకులు నంబూరి షణ్ముఖరావు, రైతు సంఘం నాయకులు పాళిన సాంబమూర్తి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఎల్.రమ, హెచ్.వాణిశ్రీ, ఎల్.శ్రీదేవి, ఎ.రమాదేవి, పి.పద్మావతి, బి.ఆదిలక్ష్మి, కె.లత, కె.వి.లక్ష్మి, బి.రమణమ్మ, జయలక్ష్మి పూల దండలు ధరించి నిరాహార దీక్షలో కూర్చున్నారు. కొత్తూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద చేపటిన నిరవధిక సమ్మెలో అంగన్వాడీ యూనియన్ నాయకులు కె.లక్ష్మి, ధనలక్ష్మి, కె.వి.హేమలత, జలజాక్షి, బోడెమ్మ, పి.అనసూయమ్మ. పి.లక్ష్మి, డి.వాణి, పి.కళావతి, విజయకుమారి, ఎస్.భవాని, బి.మంగమ్మ, ఎ.రవణమ్మ, కె.రోజా పాల్గొన్నారు. నరసన్నపేట ఐటిడిఎస్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరవధిక సమ్మెకు మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సంఘీభావం తెలిపారు. ఈయన వెంట మండలం పార్టీ అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, జామి వెంకటరావు, కింజరాపు రామారావు, ఊర్ణ వెంకటేశ్వర్లు, భైరి భాస్కరరావు, కోరాడ రామచంద్రరావు, పీసా కృష్ణ, మహిళా సెంట్రీ జి.ఝాన్సీ, కూన రమేష్ పాల్గొన్నారు. ఇచ్ఛాపురం బస్టాండ్ వద్ద చేపడుతున్న సమ్మె కొనసాగుతుంది. పొందూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ యూనియన్ నాయకులు బి.జ్యోతిలక్ష్మి, రమణమ్మ, రమ, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు

కొవ్వొత్తుల ర్యాలీ

నగరంలోని పొట్టిశ్రీరాములు కూడలి నుంచి మున్సిపల్ కార్యాలయం గాంధీ విగ్రహం వద్ద అంగన్వాడీలు, సిఐటియు నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో కార్యక్రమంలో శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.నాగమణి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, పెన్షనర్స్ సంఘం నాయకులు ఎం.ఆదినారాయణమూర్తి, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఎం.గోవర్ధన్, ఐద్వా జిల్లా కన్వీనర్ లక్ష్మి, ఎపి అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి, నాయకులు టి.రాజేశ్వరి, కె.ప్రమీలాదేవి, ముత్యాలమ్మ, లీలా, భవానీ పాల్గొన్నారు.

ఎచ్చెర్లలోని అంబేద్కర్ విగ్రహం నుంచి అంగన్వాడీలు, సిఐటియు నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, ఐఎంఎల్ డిపో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.బంగార్రాజు, రమణ, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయుకులు శారద, విజయలక్ష్మి పాల్గొన్నారు. అలాగే కోటబొమ్మాళి, సోంపేట మండలాల్లోలోనూ అంగన్వాడీలు, టిడిపి, జనసేన నాయకులు పాల్గొని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు.

టెక్కలి రూరల్ : సమ్మెలో పాల్గొన్న అంగన్వాడీలు

ఇచ్ఛాపురం : సమ్మెలో పాల్గొన్న అంగన్వాడీలు

నరసన్నపేట : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రమణమూర్తి

కోటబొమ్మాళి : కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న నవీన్, కృష్ణదాస్

క్రీడల ప్రోత్సాహానికే 'ఆడుదాం ఆంధ్రా'

ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ఔత్సాహికులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' పేరిట క్రీడలను నిర్వహిస్తున్నట్టు ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. ఆడదాం ఆంధ్రా కార్యక్రమం ప్రచార కార్యక్రమంలో భాగంగా నగరంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు ఆదివారం క్రీడాకారులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టారు. ముందుగా ఈ ర్యాలీని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా క్రీడలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. యువతకు మంచి ఆరోగ్యం శరీర దృఢత్వానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలో 1,07,000 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, మరికొంత మందికి రిజిస్ట్రేషన్లు జరిగే అవకాశం ఉందన్నారు. ఐదు క్రీడా పోటీలను ఈ నెల 26 నుంచి 47 రోజులపాటు సచివాలయాల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పోటీలు నిర్వహిస్తామని అన్నారు. పంచాయతీరాజ్‌శాఖ, మున్సిపాలిటీలు, విద్యాశాఖ, స్పోర్ట్స్ అథారిటీస్ సమన్వయంతో పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు.

కృష్ణదాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు ఈ క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని అన్నారు. ప్రతిభవంతులైన క్రీడాకారులను గుర్తించడానికి చక్కటి అవకాశమని అన్నారు. కార్యక్రమంలో సహాయక కలెక్టర్ రాఘవేంద్ర మీనా, మున్సిపల్ కమిషనర్ చల్ల ఓబులేసు, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, డిఎస్‌డిఒ శ్రీధర్, ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, డిఇఒ వెంకటేశ్వరరావు, యూత్ కో-ఆర్డినేటర్ ఉజ్వల్, సమాజ సేవకులు మంత్రి వెంకట స్వామి, వైసిపి నాయకులు మెంటాడ స్వరూప్ పాల్గొన్నారు.

క్రిస్మస్ సందడి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలను సందడిగా నిర్వహించారు. అన్ని చర్చిల్లో ఆదివారం సాయంత్రం నుంచే చర్చిల్లో వేడుకలు ప్రారంభమయ్యాయి. అర్ధరాత్రి కేకును కోసి ఏసుక్రీస్తును స్తుతిస్తూ గీతాలను ఆలపించారు. శ్రీకాకుళం చిన్నబజారులోని తెలుగు బాప్టిస్టు చర్చి, ఉమెన్స్ కాలేజ్ రోడ్డులోని క్రిస్టియన్ వర్షిప్ సెంటర్, కోడి రామ్మూర్తి స్టేడియం సమీపంలోని సెయింట్ జాన్ లూథరన్ చర్చి, డగ్లస్ స్కూల్ క్యాంపస్‌లోని కీన్‌స్టోన్ చర్చి, పాత శ్రీకాకుళంలోని రార్డ్ అసెంబ్లీ చర్చి, పురుషుల డిగ్రీ కళాశాల సమీపంలోని ఆర్‌సిఎం చర్చి, టౌన్‌హాల్ వద్ద సెయింట్ థామస్, పలాసలోని సీయోన్ గ్రీస్, హెర్మాన్ గ్రీస్, పలు చర్చిల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

విద్యుత్ కాంతుల్లో పలాసలోని ఓ చర్చి

విఒఎలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విఒఎలకు మెడపై కత్తిలా ఉన్న కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, విఒఎల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అశిరినాయుడు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. స్థానిక డిఆర్‌డిఎ కార్యాలయం సమీపంలోని డచ్ బిల్డింగ్ వద్ద సిఐటియు అనుబంధ విఒఎల సంఘం జిల్లా సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెలుగు సంస్థలో పనిచేస్తున్న విఒఎలకు కోసం తీసుకొచ్చిన కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలన్నారు. హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. విఓఒలపై ప్రభుత్వం చిన్నచూపు చూడడం తగదని విమర్శించారు. గ్రామ సమాఖ్యల విలీనం ఆపాలని, సంఘాలను విడగొట్టడం, కలపడం లాంటి పనులు సెర్ఫ్ అధికారులే చేయడం సరైనది కాదని అన్నారు. విఒఎల విలీనం చేయడంతో వేలాది మందికి ఉపాధి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రాజకీయ జోక్యం అరికట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు 15 సంఘాల లోపు ఉన్న విఒఎలకు వేతనాలు చెల్లించలేదని అన్నారు. జెండర్, వయసు, చదువు పేరుతో తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. వయసు పైబడిన వారికి, అనారోగ్యంతో ఉన్న వారికి, వారి కుటుంబ సభ్యులకు విఒఎలుగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. అన్ని రకాల బకాయిలు చెల్లించాలని, లోకో యాప్ కోసం 5జి మొబైల్ ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళా మార్టుల్లో బలవంతపు కొనుగోళ్లకు విఒఎలకు లక్ష్యాలు ఇవ్వడం వల్ల తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని అన్నారు. మహిళా మార్టులకు తగిన ప్రోత్సాహకాలు కల్పించి అభివృద్ధి చేయాలన్నారు. రికవరీ పేరుతో వేతనాల కోత విధించడం ఆపాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమ్మె పోరాటానికి సమావేశం సంపూర్ణ మద్దతు తెలియజేసింది. అంగన్వాడీల కోసం ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్ల పేరుతో ఇతర డిపార్ట్‌మెంట్ల ఉద్యోగులను ఏర్పాటు చేయడాన్ని తీవ్ర అభ్యంతరకరమని తెలిపారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, విఒఎ సంఘం నాయకులు డి.జోగారావు, సరిత, బి.కనకలక్ష్మి, జి.ఎర్రయ్య, పి.లక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అమ్మన్నాయుడు, నాగమణి

కోవిడ్ వేరియంట్‌ను ఎదుర్కోవడానికి సన్నద్ధం

- జిల్లాలో ఒక్క కేసూ నమోదు కాలేదు
- వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశాం
- ఆర్‌టిపిసిఆర్ పరీక్షలు యథాతథం
- డిఎంహెచ్‌ఒ డాక్టర్ బి.మీనాక్షి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆందోళనకు గురి చేస్తున్న కోవిడ్ కొత్త వేరియంట్ జెఎన్-1పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. గత అనుభవనాలను దృష్టిలో ఉంచుకుని తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కొత్త వేరియంట్ విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రజలు మరింత జాగ్రత్తగా మెలగాలని హెచ్చరించారు. అయితే జిల్లాలో ఇంత వరకు కొత్తగా కోవిడ్ కేసులు నమోదు కాలేదని తెలిపారు. ఆమె కొత్త వేరియంట్‌ను ఎదుర్కోవడానికి ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సర్వం సన్నద్ధంగా ఉన్నామన్నారు. ఇప్పటికే క్షేత్ర స్థాయిలో పిహెచ్‌సి, యుపిహెచ్‌సి, ఏరియా ఆస్పత్రుల సిబ్బందని అప్రమత్తం చేశామని చెప్పారు. ఎప్పటిలాగే ప్రజలు భౌతిక దూరాన్ని పాటించి మాస్కులను దరించాలన్నారు. దేశంలో కోవిడ్ కేసులు నమోదు అవుతున్న సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జిల్లాలో ఎదుర్కొనే పరిస్థితులపై ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

? కోవిడ్ కొత్త వేరియంట్‌పై ఎంత మేరకు అప్రమత్తంగా ఉన్నారు?

నిరంతర పర్యవేక్షణ ఉంది. కోవిడ్ కొత్త వేరియంట్ జెఎన్-1 జాడ జిల్లాలో ఇంతవరకు రాలేదు. రోజూ రిమ్స్‌లో కోవిడ్ ఆర్‌టిపిసిఆర్ పరీక్షలు చేస్తున్నాం. పాజిటివ్ కేసులు ఇంత వరకు నమోదు కాలేదు. క్షేత్ర స్థాయిలో సిబ్బందిని అప్రమత్తం చేశాం. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం నుంచి కొత్త వేరియంట్‌పై పలు సూచనలు వచ్చాయి. వాటికి అనుగుణంగా అప్రమత్తంగానే ఉన్నాం. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సీజన్‌లో జ్వరాలు, జలుబు ఎక్కువ మందిలో వస్తుంటాయి. అంత మాత్రాన భయ పడాల్సిన పనిలేదు. పరీక్షలు చేయించుకుంటే తగిన మందులు తీసుకునేందుకు వీలుంటుంది. ప్రయివేటు ఆస్పత్రుల్లో వచ్చిన వారికీ పరీక్షలు చేయించుకునేలా ఆదేశాలు జారీ చేశాం.

డాక్టర్ మీనాక్షి, డిఎంహెచ్‌ఒ

? పరీక్షల కిట్లు ఎంతమేరకు అందుబాటులో ఉన్నాయి?

జిల్లాలో కోవిడ్ పరీక్షలకు అవసరమైన ఆర్‌టిపిఆర్ కిట్లు అం దుబాటులో ఉన్నాయి. జిల్లాలోనూ, నగరంలో అన్ని పిహెచ్‌సి, యుపిహెచ్‌సి, ఏరియా ఆస్పత్రులకు అందుబాటులో ఉన్న రాపిడ్ కిట్లు, ఆర్‌టిపిసిఆర్ కిట్లు, శానిటైజర్లు, మాస్కులు పంపిణీ చేశాం. మూడు రోజులు మించి జ్వరం ఉన్న వారికి రాపిడ్ పరీక్షలు చేయమని సూచించాం. అందులో పాజిటివ్ అని నిర్ధారణ అయితే వారికి ఆర్‌టిపిసిఆర్ పరీక్షలు చేస్తారు. అందులోనూ పాజిటివ్ అని తేలితే నమూనాలను (శాంపిల్) వేరియంట్ పరీక్షల కోసం పూనే పంపిస్తారు.

? ప్రయివేటు ఆస్పత్రుల్లో పరీక్షలు ఎలా నిర్వహిస్తున్నారు?

జిల్లాలోని ప్రయివేటు ఆస్పత్రుల్లోను, రిమ్స్‌లోను కోవిడ్ పరీక్షలు నిర్వహిస్తారు. ప్రధానంగా కోవిడ్ విస్తరణ ఉన్న ప్రాంతాల్లోను, విదేశాల నుంచి వచ్చిన వారికి నిరంతర పర్యవేక్షణ చేస్తున్నాం. జిల్లాలో వైద్యాధికారులు, సిబ్బంది, ఎఎన్‌ఎంలు అంతా సిద్ధం చేశాం .

? ఆరోగ్యశ్రీ కొత్తకార్డులు జారీ ఎంత మేరకు వచ్చింది?

జిల్లాలో 7,90,923 ఆరోగ్యశ్రీ కార్డులు ఉన్నాయి. ఇంతవరకు రూ.5 లక్షల వరకు మాత్రమే పరిమితి ఉండేది. ప్రభుత్వం ఇప్పుడు రూ.25 లక్షల వరకు పెంచింది. జిల్లాకు 33 వేల ఆరోగ్యశ్రీ కొత్త కార్డులు వచ్చాయి. వీటిని ఆయా పిహెచ్‌సిల పరిధిలో అందజేశాం. వీటిని ఎఎన్‌ఎంలు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందిస్తారు. వాటితో పాటు ఒక బ్రోచర్ అందించి ఆ కార్డు గురించి వాలంటీర్లు వివరిస్తారు. మిగిలిన కార్డులు విడతల వారీగా రానున్నాయి.

బిసిజి టీకాలు వేసే కార్యక్రమం ఎలా సాగుతోంది?

? జిల్లాలో 18 ఏళ్లు దాటిన వారికి బిసిజి టీకాలు వేయనున్నాం. ఎక్కువగా 60 ఏళ్లు దాటిన వారికి టీకా గురించి వివరించి వారి అనుమతితోనే వేశాం. 80 ఏళ్లు దాటిన వారికి అప్పట్లో (వారి చిన్నతనంలో) టీకాలు వేసి ఉండకపోవచ్చు. అప్పట్లో అవగాహనా తక్కువ. అందుకే 60 ఏళ్లు దాటిన వారికి టీకాలు వేయడానికి తొలిప్రాధాన్యత ఇస్తున్నాం. ఈ టీకా టిబి రాకుండా చేస్తుంది. బిసిజి టీకాలు గర్భిణులు, కేన్సర్ వ్యాధిగ్రస్తులకు వేయకూడదు. అందువల్ల ఈ రెండు రకాల వారి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని సంబంధిత వైద్య సిబ్బంది పూర్తి సమాచారం తెలుసుకున్న తర్వాత టీకా వేయాల్సి ఉంటుంది.

? రెండో విడత ఆరోగ్య సురక్ష ఎప్పడు ప్రారంభమవుతుంది?

జనవరి ఒకటో తేదీ నుంచి ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేస్తాం. గతంలో మాదిరి కాకుండా మండలాల్లో మంగళవారం రెండు, శుక్రవారం రెండు మండలాలలో నిర్వహిస్తారు. నగరంలో బుధవారం 11 వార్డులు, గురువారం 11 వార్డుల్లో నిర్వహిస్తాం. అందుకు తగ్గ ప్రభుత్వ సూచనలను క్రమం తప్పకుండా పాటించాల్సి ఉంటుంది.

మాట్లాడుతున్న డాక్టర్ శివాజీ

ఎన్నాళ్లీ సాగునీటి వివక్ష?

ప్రజాశక్తి - కవిటి

ఇచ్ఛాపురం నియోజకవర్గ రైతాంగం సాగునీటి పంపిణీలో ఇంకెన్నాళ్ల వివక్ష ఎదుర్కోవాలని, ఎప్పటికి తమకు సాగునీరు అందిస్తారని నియోజకవర్గంలోని రైతు కుల సంఘం నాయకులు ప్రశ్నించారు. వ్యవసాయమే జీవనాధారమైన నియోజకవర్గంలో సాగునీరు లేక వలసలు పెరిగిపోతున్నాయని, కమతాలు తరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని గొర్రెలపాడులోని ఎఎంసి కార్యాలయ ఆవరణలో నియోజకవర్గ రైతుకుల సంఘ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వంశధార సాధనా కమిటీ కన్వీనర్ ప్రధాన శివాజీ మాట్లాడుతూ వంశధార నదీ జలాలు పూర్తిస్థాయిలో వినియోగిస్తే ఇచ్ఛాపురం చివరి వరకు సాగునీటికి కొరత ఉండదని అన్నారు. ముఖ్యంగా నేరడి బ్యారేజ్ సమస్యలు తొలగిపోతే ఇది సాధ్యమవుతుందని అన్నారు. ఇటీవల పలాస వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి దీనిపై వినతిపత్రం అందించామని అన్నారు. దీనిపై సిఎం స్పందిస్తూ వంశధార ఫేజ్-3లో దీన్ని అమలు చేద్దామని అన్నట్టు తెలిపారు. పారిశ్రామికంగా వెనుకబడిన ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 80 శాతం ప్రజలకు వ్యవసాయమే జీవనాధారంగా ఉందని, ఇటువంటి పరిస్థితుల్లో స్థానికులు ఆర్థికంగా పరిపుష్టి పొందాలన్నా, వలసలు తగ్గాలన్నా నదీ జలాల అనుసంధానం తప్పనిసరని అన్నారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి సంగారు లక్ష్మీనారాయణ, జీడి మద్దతు ధర పోరాట కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యమే నేటి దుస్థితికి కారణమని ఆరోపించారు. చిత్తశుద్ధితో కృషిచేస్తే జిల్లాలో ప్రతి సెంటుకూ నీరందుతుందని అన్నారు. రైతుకుల సంఘం అధ్యక్షుడు జెన్నెల ప్రసాదరావు, నర్తు నరేంద్ర యాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గం వరకు రావాల్సిన నదీ జలాలు మధ్యలోనే ఆగిపోతున్నాయని, వంశధార బాహుదా నదీ జలాలు అనుసంధానం జరిగి నియోజకవర్గానికి సాగునీరు అందించేవరకు పోరాటం చేయాలని సూచించారు. సమావేశంలో నియోజకవర్గంలోని రైతులు, రైతు కుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE II ADDITIONAL JUNIOR CIVIL JUDG cum SPECIAL MOBILE COURT AT SRIKALAM.
I.A.No.07/2019 in O.S.No. 23/2019.

Between: **Thammisetty Laxmana Rao and another** --Petitioners / Plaintiffs
And: **Thammisetty Mohana Rao and three others** --Respondents/Defendants
To:
R-1: Tammisetty Mohana Rao, S/o Late Gannayya, R/at D.No.15-13-17, Behind Andhara Bank, Arasavaelli Village and Post, Srikakulam Rural mandalam and District.

Take notice that the above Petition is posted for your notice and that you are hereby appear before the Honourable court of the II ADDITIONAL JUNIOR CIVIL JUDG cum SPECIAL MOBILE COURT, Srikakulam on **29-12-2023 at 10-30 A.M** personally or through Advocate. If you fails to appear the matter will be decide exparte.

VANA KRISHNA CHAND
VULLAKULA KRISHNA RAO
Advocate for the Petitioners,
SRIKAKULAM,
Ph.No. 9441589351, 8309502074.

IN THE HONOURABLE COURT OF THE II ADDITIONAL JUNIOR CIVIL JUDG cum SPECIAL MOBILE COURT AT SRIKAKULAM.
O.S.No. 23/2019.

Between: **Thammisetty Laxmana Rao and another** --Plaintiffs
And: **Thammisetty Mohana Rao and three others** --Defendants
To:
D-1. Tammisetty Mohana Rao, S/o Late Gannayya,R/at D.No.15-13-17, Behind Andhara Bank,Arasavaelli Village and Post, Srikakulam Rural mandalam and District.

Take notice that the above Suit is posted for your notice and that you are hereby appear before the Honourable court of the II ADDITIONAL JUNIOR CIVIL JUDG cum SPECIAL MOBILE COURT, Srikakulam on **29-12-2023 at 10-30 A.M** personally or through Advocate. If you fails to appear the matter will be decide exparte.

VANA KRISHNA CHAND
VULLAKULA KRISHNA RAO
Advocate for the Petitioners,
SRIKAKULAM,
Ph.No. 9441589351, 8309502074.

మహారాజశ్రీ శ్రీకాకుళం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EP. 26/2023 in OS. 106/2008

Between: **పొట్నూరు క్రిష్ణమూర్తి** --DHR/వాది
And:
1.తురకల పాపారావు,
2.తుకకల శ్యామలమ్మ --JDR'S/ప్రతివాదులు

To,
JDR-1: తురకల పాపారావు,S/o లేటు సూరయ్య, స్వీపర్, శ్రీకాకుళం మున్సిపాలిటి, R/o, Dr.No4-01-71, పెద్దరెల్లి వీది, శ్రీకాకుళం.
JDR-2: తురకల శ్యామలమ్మ,W/o పాపారావు,
--Rest do--

పై నెంబరు గల దావా డిక్రీ బాకీ వసులు నిమిత్తం పై నెంబరు అమలు పిటిషన్‌ను **DHR** మీ ఇరువురుపై దాఖలు చేసియున్నాడు. సదరు అమలు పిటిషన్ **తే॥09-01-2024ది నాడు మీ హాజరు నిమిత్తం వాయిదా అయి ఉన్నది. అ దినం ఉ॥ గం॥ 10: 30 ని॥ లకు** పైన తెలిపిన కోర్టు యందు మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేయవలెను. లేనియడల మీ పరొక్షమందు కేసు విచారించి తీర్మానించబడమగును.

భైరి దామోధర్‌రావు
న్యాయవాది, శ్రీకాకుళం.

BEFORE THE MOTOR ACCIDENTS CLAIM TRIBUNAL-CUM XXVII ADDL CHIEF JUDGE: CITY CIVIL COURTS: AT:SECUNDERABAD
O.P. No. 759 OF 2022

Between:
smt.Chinthal kousalya ...Petitioner
And
Bijaya kumar kar & Others ...Respondents

To,
R-2 Y, Balaji S/o. Y. Chandrayya
Aged about: Major Occ.. Business, H.No.1-1-36, Main Road, Purusottapuram, Ichapuram, Srikakulam, A.P. State -532312.

NOTICE

Please take notice that in the above matter the Petitioner had filed case against you (Respondent No.2) for compensation of Rs. 5,00,000/- and the same is posted for your appearance on **3-1-2024**

you are advised to appear on **3-1-2024 a.m.** before the said count either in person or through an Adcocate failing which, the case will be decided exparte.

(BY THE ORDER OF THE COURT)
M/S. BANDI KALAVATHI REDDY
(TS/1917/2012)
GODUGU KRISHNA
(TS/1539/2017)
Advocate #:H.No. 3-12-126/1/405, P.S Residency, P.B. Colony Ramanthapur, Amberpet, Hyderbad-13
kalvathireddy61@gamail.com
Counsel for petitioner

మహారాజశ్రీ శ్రీకాకుళం ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టులో
GOP No. 25/2023

Between: **దుంగ ఈశ్వర్** --వాది.
And: **NIL** --ప్రతివాదులు

బహిరంగ ప్రచురణ.

పై నంబరు వాజ్యములో వాది అయిన దుంగ ఈశ్వర్ తన యొక్క మైనర్ కుమార్తె, దుంగ సంధ్యారాణికి మరియు ఈ దిగువ దావా ఆస్తికి Guardian of Person and Property గా నియమించమని పై కోర్టు వారినికోరియున్నాడు. కావున పై విషయమై ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు గాని ఉన్నయడల **తే4-01-2024 న ఉదయం గం॥ 10-30ని॥ లకు** పై కోర్టు వారి ముందు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియ పర్చుకోనవలెను, కాని యెడల మీ పరోక్షమున తీర్మానించడమగునని ఇందుమూలంగా యావన్మందికి తెలియ చేయడమైనది. **షెడ్యులు ఆస్థి వివరం:-** శ్రీకాకుళం జిల్లా శ్రీకాకుళం సబ్-డి, శ్రీకాకుళం మండలం, సానివాడ పంచాయితీ గ్రామము లెక్క దాఖాలా సర్వే నెం. 145/9రులో జిరాయితి మెట్టు స్థలం వివరం: తూర్పు - పడమరలకు : 36 అడుగులు (10.972 మీ.) ఉత్తర - దక్షణలకు తూర్పువైపు 24 అడుగులు (7.315 మీ.)ఉత్తర - దక్షిణాలకు: పడమరవైపు 15 అడుగులు (4.572 మీ.) కొలతలు కలిగి 78 చ॥ టజాలు (65.239) చ॥మీ॥ విస్తీర్ణం గల మెట్టు.
స్థలం కు హద్దులు: తూర్పు 16 అడుగుల రోడ్డు. దక్షిణ: కోయ్యాన ఉపేంద్రగారి మెట్ట స్థలం. పడమర: వండాన అప్పారావు మెట్టుస్థలం ఉత్తర : నీరు పారే బట్టి

(పైకోర్టు వారి ఆర్ధర్ ప్రకారం)
D. PARDHA SARADHI
Advocate,
Srikakulam, Cell: 9440417374

గౌరవ వందనం స్వీకరిస్తున్న డిఐజి హరికృష్ణ

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

విశాఖపట్నం రేంజ్ డిఐజి హరికృష్ణ

ప్రజాశక్తి- పలాస

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విశాఖపట్నం రేంజ్ డిఐజి ఎస్.హరికృష్ణ హెచ్చరించారు. కాశీబుగ్గ డిఎస్‌పి కార్యాలయం, సర్కిల్ పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆయన పోలీస్‌స్టేషన్‌లో వివిధ కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అలాగే డిఎస్‌పి కార్యాలయంలో డివిజన్‌కు సంబంధించిన మొత్తం పోలీస్ స్టేషన్ల వారీగా తనిఖీలు చేపట్టారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఫిర్యాదుల విభాగంలో రికార్డులు పరిశీలించి నిత్యం నమోదు అవుతున్న కేసులు నమోదు చేయాలని సూచించారు. అంతకుముందు డిఐజికి పోలీసులు గౌరవ వందనాన్ని సమర్పించారు. ఈయన వెంట డిఎస్‌పి నాగేశ్వరరెడ్డి, సిఐలు నవీన్‌కుమార్, శంకరరావు, మల్లేశ్వరరావు ఉన్నారు.

మాట్లాడుతున్న జెసి నవీన్

హక్కుల కోసం రక్షణ చట్టాలు

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వినియోగదారులు తమ హక్కుల గురించి పూర్తిగా తెలుసుకోవాలని సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్ పేర్కొన్నారు. బాపూజీ కళామందిర్‌లో కన్స్యూమర్ అఫైర్స్, ఫుడ్ అండ్ సివిల్ సప్లయస్, ఫెడరేషన్ అఫ్ కన్స్యూమర్ ఆర్గనైజషన్ సంయుక్తంగా ఆదివారం జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఆన్‌లైన్ శకం నడుస్తోందని అన్నారు. వినియోగదారులు నష్టపోకుండా ఉండేందుకు, మోసపూరిత వ్యాపారస్తులకు అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంతో వినియోగదారుల చట్టం అమల్లోకి తీసుకొచ్చారని పేర్కొన్నారు. వినియోగదారులు తమ కొనుగోలు చేసిన వస్తువుపై పూర్తి అవగాహన కలిగినప్పుడు, కొనుగోలు చేసిన వస్తువు నిర్దేశించిన ప్రమాణాల్లో ఏమైనా లోపం ఉంటే వారికి ప్రశ్నించే హక్కు ఈ చట్టం ద్వారా ఏర్పడిందని అన్నారు. తద్వారా వినియోగదారులు లబ్ధి పొందగలుగుతారని తెలిపారు. పాఠశాలల్లో వినియోగదారుల క్లబ్‌లు ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. వినియోగదారుల క్లబ్‌లను ఏర్పాటు చేసిన మాస్టర్ ట్రైనర్ వెంకటాచలం రచించిన పోస్టర్‌ను విడుదల చేశారు. జిల్లా సరఫరాల అధికారి డి.వెంకటరమణ మాట్లాడుతూ వినియోగదారుల కేసులు సమర్థవంతంగా పరిష్కరించుకోవాలంటే ఈ చట్టంపై వినియోగదారులకు సరైన అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా తునికలు కొలతల శాఖ అధికారి శంకర విశ్వేశ్వరరావు వినియోగదారులు కొనుగోలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో డిఇఒ వెంకటేశ్వరరావు, సహాయ ఆహార భద్రతాధికారి రత్నం, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ నక్కా యుగంధర్ పాల్గొన్నారు.

క్రీడాకారులను సన్మానిస్తున్న సభ్యులు

క్రికెట్ క్రీడాకారులకు ప్రోత్సాహం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జిల్లా క్రికెట్ సంఘం ఎంతగానో కృషి చేస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పుల్లెల శాస్త్రి తెలిపారు. నగరంలోని సన్‌రైజ్ హోటల్‌లో క్రికెట్ సంఘం సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో క్రికెట్ క్రీడను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు తగ్గట్టుగా మౌలిక వసతులను సమకూర్చుకోవడానికి సంఘం ప్రత్నిస్తోందన్నారు. ఇప్పటికే రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును కలిసి పెద్దపాడు సమీపాన క్రికెట్ మైదానం కోసం స్థలాన్ని కేటాయించాలని కోరినట్టు తెలిపారు. ఆయన సహకారంతో మైదానం అభివృద్ధి చేయనున్నట్టు పేర్కొన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానం, కళింగపట్నం, టెక్కలి ఐతం కళాశాలల్లోని మైదానాలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ముందుగా వివిధ స్మారక ట్రోఫీల్లో విజేతలుగా నిలిచిన మహిళా విభాగంలో శ్రావ్య, నవ్య కౌముదిని, పురుష విభాగంలో శ్రీనివాస్, సుశాల్, సూర్యకిరణ్, ప్రణీత్, విజయ్‌లను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు అలింఖాన్, లాల్ బహుదూర్‌బీ, కౌన్సెలర్ డాక్టర్ ఎస్.రవికుమార్, కోశాదికారి శైలానీ, హాసన్ రాజ్, రంజీ మాజీ క్రికెట్ ప్లేయర్ రవిచలం, నూతన సభ్యులు పవన్ కార్తీక్ పాల్గొన్నారు.

జ్యోత్స్న తిరుణగిరి అవార్డు అందుకుంటున్న జయరామ్

జయరామ్‌కు రాష్ట్రీయ గౌరవ్ అవార్డు ప్రదానం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలం రుంకు హనుమంతుపురం గ్రామానికి చెందిన పొలాకి జయరామ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో లక్షలాది మంది విద్యార్థుల జీవితాల్లో జీవన ప్రమాణాలు అభివృద్ధి కోసం కృషి చేసినందుకు రాష్ట్రీయ గౌరవ్ అవార్డు ఈ నెల 23న జ్యోత్స్న తిరునగిరి సమాష్కర ఫౌండేషన్ ఫౌండర్, నేషనల్ టిడిపి స్పోకెస్‌పర్సన్ చేతులు మీదిగా హైదరాబాద్‌లో అందించారు. ఈ అవార్డు దేశంలో సాంఘిక సేవలు చేసిన వారికి ఉన్నతమైన గుర్తింపుగా అందిస్తారు. జయరాం మాట్లాడుతూ ఎపి, తెలంగాణా రాష్ట్రంలో విద్యార్థులకు ఉన్నత విద్యకు శిక్షణ, ప్రధాన యూనివర్సిటీల్లో, కాలేజీల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో జీవన ప్రమాణాలు అభివృద్ధిపై 3లక్షల మంది విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించామన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఒక ప్రముఖ ఐటీ కంపెనీలో ప్రాజెక్ట్ మేనేజర్‌గా పనిచేస్తూనే ఉచితంగా, సొంత ఖర్చులతో విద్య, ఉద్యోగ అవకాశాలపై యువతకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ అవార్డును ప్రతి సంవత్సరం ఉన్నతమైన సమాజ అభివృధి చేసిన వారికి అందిస్తారన్నారు. గుర్తింపుగా రాష్ట్రీయ గౌరవ్ అవార్డ్స్ కు ఎంపిక చేసి అవార్డ్స్ అందిస్తారు అని అన్నారు. యువత ప్రణాళికా ప్రకారం సహనంతో కష్టపడితే విజయం ఎప్పుడు చేరువలో ఉంటుందని, ఉన్నతంగా ఎదుగుతారని జయరాం తెలిపారు.

ధాన్యం కొనేదెప్పుడు?

- మండలంలో ప్రారంభించని వైనం
- సిబ్బంది పనితీరుపై అసంతృప్తి
- నిరాశలో రైతన్న

ప్రజాశక్తి- కవిటి

ఆరుగాలం కష్టపడి పండించిన పంట అమ్ముకుని ఇంటి ఖర్చులు, చేసిన అప్పులు తీర్చుకుందామని అనుకున్న రైతన్నకు నిరీక్షణ తప్పడం లేదు. ఓవైపు తీవ్ర వర్షాభావ పరిస్థితులు, మరోవైపు అనుకూలించని ప్రకృతితో ఏదోలా సాగుచేసినా ఇప్పటికీ మండలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కళ్లంలో ఉన్న ధాన్యం

మండలంలో సుమారు 2,700 ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. నూర్పులు చేసి ధాన్యంతో కూడా సిద్ధంగా ఉన్నారు. కానీ, ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకూ ఒక్క గింజా కొనుగోలు చేయలేదు. ఏమని అడిగితే జిపిఎస్ వాహనాల కొరత ఉందని, రైతులు ఇంకా తమను సంప్రదించడం లేదని, వచ్చిన వారిలో కొంతమంది రైతుల ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉందని వ్యవసాయ సహాయక సిబ్బంది చెబుతున్నారు. ఈ సమాధానాలపై రైతన్నలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని సచివాలయాలు, ఇంతమంది సిబ్బందికి ఎక్కడ పంట ఉంది, ఏ ప్రైవేట్ అందుబాటులో వస్తుంది అనేది రైతు ప్రత్యేకంగా చెప్పే ఇంతమంది సిబ్బంది ఎందుకని ప్రశ్నిస్తున్నారు. 20రోజులకు పైగా ధాన్యంతో ఎదురుచూస్తున్నా ఇప్పటి వరకూ మండలంలో ఒక్క ధాన్యం గింజా కొనుగోలు జరగలేదంటే వ్యవస్థ ఏవిధంగా పనిచేస్తోందో తెలుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో పూర్తిస్థాయిలో వ్యవసాయ అధికారి లేకపోవడం, సచివాలయం వ్యవసాయ సిబ్బంది ఎవరికి వారే ఏమునాతీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నట్లు రైతులు అంటున్నారు. కేవలం ఇద్దరు, ముగ్గురు తప్పించి సిబ్బంది పనితీరు బాగులేదని బాహాటంగానే చెబుతున్నారు. దానికి నిదర్శనంగా పూర్తిస్థాయిలో జరగని ఈ-క్రాప్, ధాన్యం కొనుగోలు సంఘటనలేనని రైతులు చెబుతున్నారు. కనీసం దళారులకైనా అవకాశం ఇస్తుంటే తమ ధాన్యం ఎప్పుడో వెళ్లిపోయేదని వీరు నిట్టూరుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే ధాన్యం కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

రెండు రోజుల్లో కొనుగోలు చేస్తాం

మరో రెండు రోజుల్లో ధాన్యం కొనుగోలు ప్రారంభం వుతుంది. కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా కొంత ఆలస్యం జరిగింది. ప్రస్తుతం అన్ని పరిష్కరించాం. మంగళవారం నుంచి ధాన్యం కొనుగోలు చేపడతాం.

- పి.సత్యనారాయణ, ఇన్‌ఛార్జి వ్యవసాయ అధికారి, కవిటి

20 రోజులుగా ఎదురుచూస్తున్నా

నూర్పు చేసి 20 రోజులకు పైగా గడిచింది. ఇంతవరకు కొనుగోలు జరగలేదు. ఏమంటే జిపిఎస్ వాహనాల కొరత అని చెప్పారు. వాతావరణం అనుకూలంగా ఉంది కాబట్టి పర్వాలేదు. లేదంటే మా పరిస్థితి ఏంటి. ఇదే పరిస్థితి కొనసాగితే సాగు కష్టమే.

- బెందాళం కిరణ్, రైతు, కవిటి

కౌలు కట్టడానికి డబ్బులు లేవు

నేను 1.5 ఎకరాల భూమి కౌలు చేసి 1064 రకం సాగుచేశాను. నూర్పు చేసి 20 రోజులు అయ్యింది. ధాన్యం అమ్మి కౌలు డబ్బులు కట్టాలి, పండగ జరుపుకోవాలి. కానీ, ఇంతవరకు ధాన్యం మాత్రం కొనుగోలు జరగలేదు. ఎప్పుడు జరుగుతుందో కూడా నాకు తెలీదు. నాలాంటి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది.

- జీరు కూర్మారావు, కౌలు రైతు, ప్రగడపుట్టుగ

సమగ్ర శిక్ష సిబ్బంది సమ్మెకు మద్దతు

టెక్కలి : మండల విద్యాశాఖ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్ఎస్ఎ సిబ్బంది న్యాయపరమైన డిమాండ్లు పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని మండల యుటిఎఫ్ కార్యదర్శి తమ్మినేని వైకుంఠరావు అన్నారు. ఎస్-ఎస్ఎ సిబ్బంది చేస్తున్న సమ్మెకు మద్దతు తెలుపుతూ ఆదివారం ప్రకటన విడుదల చేశారు. దశాబ్దాల కాలం నుంచి విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది సమ్మెవలన విద్యారంగ కార్యకలాపాలు స్తంభిస్తాయన్నారు. పలువురు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ఎస్ఎస్ఎ సిబ్బంది సమ్మె ప్రారంభించి ఐదురోజులు కావస్తున్నా నేటివరకు ప్రభుత్వం స్పందించికపోవడం విచారకరమన్నారు. మద్దతు తెలిపిన వారిలో యుటిఎఫ్ నాయకులు పాలవలస ధర్మారావు, కురమాన దాలయ్య, డొంకాన పాపారావు, డి.వైకుంఠరావు, రోణంకి విజయ్‌కుమార్, పోట్నూరు జగదీష్, మారం కుమారస్వామి ఉన్నారు.

మాట్లాడుతున్న దుర్గారావు

శివారు ప్రాంతాలకు నీరందించడంలో విఫలం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వంశధార శివారు ప్రాంతాలకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని జనసేన పలాస నియోజకవర్గం ఇన్‌ఛార్జి దుర్గారావు అన్నారు. ఆదివారం నగరంపెల్లిలో టిడిపి, జనసేన అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండల కేంద్రం నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు పెద్దబడాం మీదుగా డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశబందు, కొత్తచెరువులను కలిపి మిని రిజర్వాయర్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో దువ్వాడ జయరాం చౌదరి, సనపల చక్రవర్తి, దువ్వాడ అప్పారావు పాల్గొన్నారు.

ఉల్లాసంగా వన సమారాధన

ప్రజాశక్తి- కవిటి

ఇచ్ఛాపురం నియోజకవర్గం చాదత్త శ్రీ వైష్ణవ సంఘం వన సమారాధన కార్యక్రమం ఆదివారం కవిటిలో ఉల్లాసంగా జరిగింది. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో సాగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎపి చాదత్త శ్రీ వైష్ణవ సంఘం వెల్ఫేర్ అభివృద్ధి డైరెక్టర్ కె.హరినారాయణ, శ్రీకాకుళం అధ్యక్షుడు తిరుమలరావు పాల్గొన్నారు. అనంతరం జిల్లా నూతన అధ్యక్షుడుగా ఎస్‌పి నారాయణస్వామిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వై.బాలగోపాల్, ఎస్‌పి కేశవరావు, శ్యామ్, శ్రీనివాసరావు, ఎస్.వరప్రసాద్, లింగరాజు పాల్గొన్నారు.

నారాయణ స్వామి దంపతులను సన్మానిస్తున్న సభ్యులు

రోటరీ సేవలు అమోఘం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక రోటరీక్లబ్ అధ్వర్యంలో ఆదివారం రోటరీ గవర్నర్ డి.సుబ్బారావు విజిట్ సందర్భంగా వికలాంగులకు చేయూతనిస్తు కుత్రిమ చేతులు పంపిణీ చేశారు. దాదాపు రూ.25వేలు విలువ గల కుత్రిమ చేతులు ఏడుగురు అభ్యర్థులకు తొడిగారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు రోహిత్ అధ్యక్షత వహించారు. బరంపురం రోటరీ క్లబ్ సహకారంతో సంయుక్తంగా కుత్రిమ చేతులు అందించడం జరిగిందన్నారు. రోటరీ క్లబ్ ద్వార అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. అనంతరం కాలుష్య నియంత్రణ కోసం అందించిన కాటన్ బ్యాగ్‌లు అవిష్కరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు పి.రాజకుమార్, పి.దినేష్ కుమార్, రామ కోటి, పాక దాసు, ఆమీర్ ఆలీ, నవీన్ చౌదరి, కృష్ణమూర్తి రెడ్డి, త్రినాథ్ రెడ్డి, రామారావు పాల్గొన్నారు.

సోంపేట: రోటరీక్లబ్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు తనతండ్రి చిన్నారావు జ్ఞాపకార్థం ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో ప్రయాణికుల సౌకర్యంకోసం తాగునీరు, కూర్చునేందుకు బెంచీలు ఏర్పాటు చేసి బాసటగా నిలిచారు. ఆదివారం కాంప్లెక్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన తాగునీరు, బెంచీలను ప్రారంభించారు. ప్రయాణికులకు బాసటగా నిలవడంతో స్థానికులు,

సోంపేట : బెంచీలను ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

ప్రయాణికులు రోటరీ సేవలపై హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలో శ్రీశయనవీధిలో ప్రభుత్వ పాఠశాలలో రోటరీక్లబ్ ప్రతినిధి కమల ట్రేడర్స్ అధినేత మల్లా తిరుమలరావు రూ.లక్షతో ప్రభుత్వ పాఠశాలకు (సిబిఎం స్కూల్) మూడు ఇనుము గ్రిల్స్ ఏర్పాటు చేయడంతో వీధి వాసులు రోటరీ క్లబ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యాకమిటీ, ఉపాధ్యాయులు కలిసి రోటరీక్లబ్ ప్రతినిధులకు దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ జిల్లా గవర్నర్ రావూరి సుబ్బారావు (దత్త), రోటరీ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు, కృష్ణారావు, రమణ, రవికుమార్, వి.శివశంకర్, సభ్యులు పాల్గొన్నారు.

కృపారాణిని సన్మానిస్తున్న వైసిపి నాయకులు

రైతు అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

రైతుల అభ్యున్నతికి అన్నివిధాల కృషిచేస్తానని వ్యవసాయశాఖ మార్కెట్ కమిటీ చైర్మన్ సుగ్గు పుణ్యవతి అన్నారు. మార్కెట్ కమిటీచైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. వైస్ చైర్మన్‌గా బొడ్డు వెంకటరమణ, సభ్యులుగా ఎస్.సుహాసిని, కె.గిరిబాబు, కె.మణమ్మ, ఎం.శాంతారావు, బి.అనంతసాయి, ఎం.కళ్యాణి, కె.నాగరత్నం, ఎం.శాంతికుమారి, ఎం.కుమారి, ఎం.భాస్కరరెడ్డి, టి.అదినారాయణ, కె.లక్ష్మి, ఎస్.మందాకినిలు బాధ్యతలు స్వీకరించారు. వీరికి సుగ్గు రామిరెడ్డి, జెడ్‌పిటిసిలు దుబ్బ వెంకటరావు, పాల వసంతరెడ్డి, కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, వైఎస్ ఎంపిపి బోయిన నాగేశ్వరరావు, సర్పంచ్ కాళ్ళ సంజీవరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పుష్పగుచ్చాలు ఇచ్చి అభినందనలు తెలియజేశారు.

పుణ్యవతికి అభినందనలు

నౌపడ: కోటబొమ్మాళి ఎఎంసి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సుగ్గు పుణ్యవతికి పలువురు వైసిపి నాయకులు అభినందనలు తెలిపారు. ఎఎంసి చైర్మన్ కుమారుడు సుగ్గు రామిరెడ్డి కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, టెక్కలి వైసిపి ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్‌తో పాటు పలువురు వైసిపి సీనియర్ నాయకులను మర్యాద పూర్వకంగా కలిశారు. తమకు మద్దతుగా నిలిచిన నాయకులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి మండల వైసిపి అధ్యక్షుడు జీరు బాబూరావు, నందిగాం ఎంపిపి శ్రీరామూర్తి, పిఎసిఎస్ డైరెక్టర్ పిలక రవికుమార్ రెడ్డి, సర్పంచ్‌లు తోట రామరాజు, భూషణరెడ్డి, చిన్ని జోగారావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన ఆటో కార్మికులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ అవరణలో ఆటోలు నిలుపుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆటో యూనియన్ నాయకులు ఎంపీ రామ్మోహన్ నాయడుకి వినతిపత్రం సమర్పించారు. గత కొద్ది రోజులుగా రైల్వేస్టేషన్ వద్ద ఆటోలు నిలిపేందుకు అవకాశం ఇవ్వకపోవడంతో రైల్వే ప్రయాణికులు అనేక మంది ఆటోలు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారని, సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికులకు స్టేషను వద్ద ఆటోలు ఉంటే గమ్యస్థానాలకు వెళ్లేందుకు వీలుగా ఉంటాయన్నారు. రైల్వే అధికారులు ఒక్కసారిగా స్టేషను అవరణలో ఆటోలు వద్దని చెప్పడంతో ఆటోకార్మికుల ఉపాధికి విఘాతం కలుగుతుందని ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీ రామ్మోహన్‌నాయుడు ఆటో

ఎంపీకి సమస్యను వివరిస్తున్న ఆటో కార్మికులు

కార్మికుల సమస్యపై సానుకూలంగా స్పందించి రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి కార్మికులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆటో యూనియన్ నాయకులు ఉలాసి ఎర్రయ్య రెడ్డి, కొండ శంకర్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలో ఎంపీ కార్యాలయానికి వెళ్ళి తమ సమస్యలు చెప్పడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు బి.మోహనరావు, ముకుందరావు, తిరుమల, గోపాల్, భాస్కర్ కాళీ ఉన్నారు.

వైద్య శిబిరాలకు స్పందన

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో నిమ్మతొర్లాడ గ్రామంలో శ్రీకాకుళం నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు, సంఘ సేవకులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ ఆధ్వర్యంలో 200 మందికి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలికాలంలో గుండె, నరములు ముడుచుకుపోయి గుండె సమస్యలు వచ్చే ఆస్కారం ఎక్కువగా ఉందన్నారు. చలికాలంలో అందరూ గోరువెచ్చని నీటిని తాగాలని సూచించారు. అన్ని జబ్బులకు సకాలంలో మందులు సక్రమంగా వాడాలని రోగులకు సూచించారు. అనంతరం రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. గ్రామస్తుల

రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి సురేష్

సమక్షంలో మొక్కలను నాటి గ్రామపెద్దలను అభినందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

బూర్జ : మండలంలో కాలపర్తి పంచాయతీ పరిధిలో హనుమయ్యపేటలో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎంపిపి కర్నేన దీప వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సత్యసాయిసేవా సంస్థలు ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. మానవసేవయే మాధవ సేవగా భావించి అనునిత్యం సేవాభావంతో కార్యక్రమాలు నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా పాలకొండ పట్టణంలోని శ్రీ విజయఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గ్రామంలో 56 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు అభినయ్, స్రవంతి, సందీప్, రవి, మహేష్, శివ, హరితో పాటు జోనల్ కన్వీనర్ ఎం.జనార్ధనరావు, కన్వీనర్ సిహెచ్ సూర్యారావు, కో-ఆర్డినేటర్లు వెంకటరావు, జాడ షణ్ముఖ పాల్గొన్నారు. అంతకుముందు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు.

మెళియాపుట్టి : దుస్తులను పంపిణీ చేస్తున్న శ్రీకాంత్

పేదలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

సమాజంలో క్రైస్తవులు ఎటువంటి తారతమ్యం లేకుండా సోదర భావంతో మెలగాలని రాష్ట్ర టిడిపి మైనార్టీ విభాగ కార్యదర్శి, దళిత క్రైస్తవ సంఘ అధ్యక్షులు రాడ విజయ్ కుమార్ అన్నారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఆదివారం మండలంలో కొల్లివలస చర్చిలో మినీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలో శాంతి, ప్రశాంతత సమకూర్చటానికి మానవ లోకానికి ఏసుక్రీస్తు బోధనలు ఎంతో అవసరమని తెలిపారు. వృద్ధులకు, పెద్దలకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ సేవకులు రామారావు, గణపతి, ఉదయ్, శ్రీను పాల్గొన్నారు.

స్వెటర్లు...

పలాస : కాశీబుగ్గ చిన్నబడాం చర్చిలో ఆదివారం 65 మంది బీద విద్యార్థులకు స్వెటర్లు అందించారు. వైస్ చైర్మన్ మీసాల సురేష్ బాబు వీటిని అందించారు. ఈ సందర్భంగా జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు డిఎసిఎస్.కుమార్ మాట్లాడుతూ అవసరంలో ఉన్నవారికి సహాయం అందించడమే నిజమైన క్రిస్మస్ అన్నారు. కార్యక్రమంలో అనంతరావు, రాజు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : క్రిస్మస్ వేడుకలు సందర్భంగా మండలంలోని పరశురాంపురం పంచాయతీ నందవలో తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ గిరిజనులకు దుస్తులను పంపిణీ చేశారు. అలాగే కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఎస్.ఆదినాయుడు, వైస్ ఎంపిపి ప్రతినిధి పాడి అప్పారావు, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ అనపాన రాజశేఖర్‌రెడ్డి, పాస్టర్ ఎస్.అన్నయ్య, సర్పంచ్‌లు గణేష్ ప్రధాన్, పెద్దింటి చంద్రరావు, ఎస్.గొరీస్, కన్నబాబు, నారాయణరావు, వెంకటరావు, సోమేష్ పాల్గొన్నారు.

టెక్కలి : సాంప్రదాయాలను విద్యార్థి దశ నుంచే విస్తరించాల్సిన అవసరం ఉందని బిఎస్‌జెఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ కోత మురళీధర్ అన్నారు. వృందా పాఠశాల ఆవరణలో క్రిస్మస్ వేడుకలు సందర్భంగా కేక్ కట్ చేసి ప్రిన్సిపాల్ కె.అనూప్‌కుమార్‌కి తినిపించారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.ప్రమోద్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెక్కలి : కేక్ కట్ చేస్తున్న మురళీధర్

రవీంద్రభారతిలో...

నరసన్నపేట: స్థానిక రవీంద్ర భారతి స్కూల్‌లో ప్రిన్సిపాల్ వాసుదేరావు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే నాటికలు, నృత్యం, ఆట, పాటలతో అలరించారు. క్రిస్మస్ వేడుకల ప్రాముఖ్యత, జీసస్ జననం, జీవిత చరిత్రలు విద్యార్థులకు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

అంజలిని 108లో ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబసభ్యులు

కోతుల దాడిలో మహిళకు గాయాలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో దీపువలస గ్రామానికి చెందిన బొడ్డేపల్లి అంజలి కోతుల దాడిలో గాయాలపాలైంది. ఆదివారం అంజలి ఇంటి తలుపులు తెరిచి ఉన్న సమయంలో కోతులు ఇంటి లోపలికి ప్రవేశించి మాకుమ్మడిగా దాడి చేశాయి. తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే అప్రమత్తమై కోతులను వెంబడించగా అక్కడ నుంచి వెళ్లిపోయాయి. గాయపడిన అంజలిని కుటుంబసభ్యులు హుటా హుటిన 108 వాహనంలో జొన్నవలసలో 30 పడకల ఆస్పత్రికి చికిత్సకోసం తరలించారు.

కుప్పకూలిన చెక్‌పోస్టు తాత్కాలిక కేంద్రం

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద వేకువజామున జరిగిన బస్సు ఢీకొన్న ప్రమాదంలో అదృష్టవశాత్తూ ముగ్గురు వ్యక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. పట్టణ పోలీస్ అధికారులు వివరాల మేరకు భువనేశ్వర్ నుంచి విశాఖ వెళ్లే శ్రీ కీర్తనసాయి ట్రావెల్స్‌కు చెందిన ప్రైవేట్ బస్సు డ్రైవరు స్పీడ్‌గా వెళ్తూ పురుషోత్తం చెక్‌పోస్ట్ వద్ద ముందు వెళ్తున్న కంటైనర్ లారీకి గుద్దింది. ఆ కంటైనర్ లారీ పురుషోత్తం చెక్‌పోస్ట్‌కు గుద్దడంతో చెక్‌పోస్ట్ ధ్వంసమై బస్సులో ఉన్న డ్రైవర్ మొగల కిరణ్, బస్సులో క్లీనర్‌గా పనిచేస్తున్న బీహార్‌కు చెందిన గిరేంద్ర కుమార్ సాహూ, వైజాగ్‌కు చెందిన మద్దిల వాసుకు గాయాలయ్యాయి. బాధితులు ఇచ్ఛాపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేసుకొని మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖ పట్నంలో జాయిన్ అయ్యారని తెలిపారు. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాలేదు. ఈ ప్రమాదంపై ఇచ్ఛాపురం టౌన్ హెచ్‌సి బి.జగదీశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలో మద్యం దుకాణాల్లో ఆదివారం రాత్రి ఆకస్మికంగా ఎక్సైజ్ విజిలెన్స్ అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. పలురకాల బ్రాండ్లు పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణాల్లో రికార్డులను పరిశీలించి, నిల్వలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎస్ఐ అప్పారావు మాట్లాడుతూ ఇటీవలే జిల్లాలో జరుగుతున్న మద్యం కల్తీ పరిణామాల నేపథ్యంలో అన్ని ప్రభుత్వ దుకాణాల్లో సాధారణ తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో మద్యం కల్తీలపై నిఘా పెంచామన్నారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అధికారులు ఉన్నారు.

నాటుసారా పట్టివేత

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలో మెట్టూరు కూడలి వద్ద ఆదివారం వాహనాలు తనిఖీల్లో భాగంగా ఎస్ఐ ఎంఎ అహమ్మద్ ద్విచక్ర వాహనంపై 20 లీటర్ల నాటుసారా తరలిస్తున్న మెట్టూరుకు చెందిన బాలును పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నాటుసారాను ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

31లోగా బయోమెట్రిక్

ప్రజాశక్తి- పొందూరు

శ్యామలరావు

వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత పంపిణీకి సంబంధించి లబ్ధిదారులందరూ ఈనెల 31లోగా బయోమెట్రిక్ వేయాలని ఎపిఎం గురుగుబెల్లి శ్యామలరావు ఆదివారం పేర్కొన్నారు. నాలుగో విడతకు సంబంధించి మండలంలో సుమారు 1430 స్వయంశక్తి సంఘాలకు సుమారు రూ.11 కోట్లును జనవరి నెలలో పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. సంఘాలకు సంబంధించిన బ్యాంకుఖాతాల్లో ఏమైనా తప్పులుంటే వెంటనే సరిచేసుకోవాలని సూచించారు. ఈ నెలాఖరులోగా లబ్ధిదారులతో తప్పనిసరిగా బయోమెట్రిక్ వేయించాలని సిసిలు, విఓఎలకు ఆదేశించారు.

రానున్న ఎన్నికల్లో వైసిపిదే విజయం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

హరినారాయణ

రానున్న ఎన్నికల్లో వైసిపిదే విజయమని మండల యువజన విభాగం అధ్యక్షుడు మద్దిల హరినారాయణ అన్నారు. ఆదివారం రెయ్యిపాడులో విలేకరులతో మాట్లాడుతూ మండల యువజన విభాగం అధ్యక్షుడుగా తనను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి యువజన అధ్యక్షుడుగా అవకాశం ఇచ్చిన సిఎం జగన్మోహన్ రెడ్డి, రాష్ట్రమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు ధన్యవాదాలు తెలిపారు. పలాసలో నిర్మించిన కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఉద్దానం ప్రాంతానికి తలమానికంగా నిలిచిందన్నారు. పార్టీకి విధేయుడుగా పార్టీ అభివృద్ధికి పని చేస్తానన్నారు. హరి నారాయణ నియామకం పట్ల వైసిపి శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

యువతకు ఆదర్శం నేతాజీ

ప్రజాశక్తి- కవిటి

ఓపెన్ కేటగిరీలో ఎస్ఐ కొలువు సాధించిన నర్తు నేతాజీ నేటి యువతకు ఆదర్శంగా నిలిచారని జనసేన నాయకుడు దాసరి రాజు, వరక పంచాయతీ సర్పంచ్ సావిత్రి శ్యామ్ పురియా కొనియాడారు. ఆదివారం నర్తుపుట్టుగలో నేతాజీ నివాసానికి వెళ్లిన నాయకులు నేతాజీని అభినందించారు. అనంతరం మాట్లాడుతూ పేదింట పుట్టి ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పోటీ పరీక్షల్లో విజయం సాధించినట్టు తెలిపారు. ఇదే స్ఫూర్తితో అతని లక్ష్యమైన సివిల్స్ సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నర్తు సోమేశ్వరరావు, దేవరాజు పురియా, శ్రీకాంత్ పురియా, బెండి జగదీష్, గుమ్మడి పురుషోత్తం, గుమ్మడి కాలేషు, జనసైనికులు, యువకులు పాల్గొన్నారు.

నేతాజీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

టిడిపి పాలనలో గిరిజనాభివృద్ధి

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

రాష్ట్రంలో టిడిపి హయాంలోనే గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారని మాజీ మండల పార్టీ అధ్యక్షుడు లావేటి పూర్ణారావు అన్నారు. ఆదివారం మండలంలో వెన్నెలవలస గ్రామంలో స్థానిక టిడిపి నాయకులు కొర్ను సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి హయంలో రాష్ట్రంలో సమగ్ర గిరిజన అభివృద్ధి జరిగిందన్నారు. ఇంటింటికి వెళ్లి భవిష్యత్ గ్యారెంటీ పత్రాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు రమేష్ పాల్గొన్నారు.

ఎల్.వి చలంకు అవార్డు

ప్రజాశక్తి- పలాస

శ్రీకాకుళం బాపూజీ కళామందిరంలో జాతీయ వినియోగదారుల దినోత్సవ కార్యక్రమంలో భాగంగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ వినియోగదారుల క్లబ్ మాస్టర్ ట్రైనర్ ఎల్‌వి.చలంకు అవార్డు అందించారు. వినియోగదారుల రక్షణచట్టం 2019 విద్యార్థులకు అవగాహన కోసం 8 పేజీల కరపత్రాన్ని తయారు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు అవగాహన చేసుకుని సమాజాన్ని కూడా చైతన్య పర్చడానికి ఈ కరదీపిక సహాయ పడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్ ఆర్.చిరంజీవి, డిఎస్ఒ. వెంకటరమణ, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు, బగాది రామ్మోహన్, నరేంద్ర పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కళా వెంకటరావు

సామాజిక భవన నిర్మాణానికి కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తూర్పుకాపుల సామాజిక భవన నిర్మాణానికి కృషి చేస్తున్నామని మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు అన్నారు. ఎచ్చెర్లలోని కేశవరెడ్డి స్కూల్ పక్కన ఓ తోటలో తూర్పు కాపు జిల్లా ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకీయాలకు అతీతంగా కుల సంఘం ఉండాలన్నారు. సంఘానికి తమ వంతు సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త డాక్టర్ గేదెల శ్రీను, జిల్లా అధ్యక్షులు ఎస్.మోహనరావు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి సభ్యులు వేపాడ చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే మీసాల నీలకంఠం నాయుడు, కలిశెట్టి అప్పలనాయుడు, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, డిసిసిబి మాజీ చైర్మన్ డోల జగన్మోహనరావు పాల్గొన్నారు.

జెసి చేతులమీదుగా ప్రశంసాపత్రాలను అందుకుంటున్న విద్యార్థులు

విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో కరజాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఆదివారం శ్రీకాకుళం బాపూజీ కళామందిరంలో వ్యాసరచన, వకృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో జి.కీర్తన, వకృత్వ పోటీల్లో బి.మహి, క్విజ్ పోటీల్లో ఆర్.రాకేశ్, వరుణ్ ప్రతిభ కనపర్చారు. ఈ విద్యార్థులకు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ చేతులమీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. విద్యార్థుల ప్రతిభ పట్ల స్థానిక హెచ్ఎం ఎల్.వెంకటరావు, ఉపాధ్యాయులు ఎల్.వెంకటాచలం, సూర్యనారాయణ అభినందించారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఆమదాలవలస: యువతలో ప్రతిభను వెలికితీయడానికి క్రీడలు దోహదపడతాయని మున్సిపల్ కమిషనర్ ఎం.రవి సుధాకర్ అన్నారు. ఆడుదాం ఆంధ్రా ప్రారంభోత్సవ సన్నాహక కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలో నిర్వహించిన మారథాన్ పరుగు కార్యక్రమాన్ని వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో సద్భావన కలుగుతుందని, తద్వారా యువతలో స్ఫూర్తికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, డిసిసిబి డైరెక్టర్ బి.నారాయణరావు, వైసిపి నాయకులు పి.శ్రీనివాసరావు, బి.రవి, డి.శ్యామలరావు, ఉమామహేశ్వరరావు, ఎం.రమేష్, ఎస్.రామారావు, బి.కోటేశ్వరరావు, ఎం.విజయ్, జె.కె వెంకటేశ్వరరావు, బి.వి.రమణమూర్తి, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ర్యాలీ ప్రారంభిస్తున్న చిరంజీవి నాగ్

ప్రతిభా పరీక్షకు స్పందన

ప్రజాశక్తి- పలాస

మండలంలోని రంగోయి ఉన్నత పాఠశాల ఆవరణలో ఉద్దానం విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన ప్రతిభాపరీక్షకు విద్యార్థుల నుంచి అపూర్వ స్పందన లభించింది. ఉద్దానం ప్రాంతంలో వివిధ హైస్కూళ్లకు చెందిన 325 మంది 10వ తరగతి విద్యార్థులు ప్రతిభాపరీక్షలో పాల్గొన్నారు. అనంతరం యువివి అధ్యక్షులు ఇస్కాకోటి జోగారావు అధ్యక్షతన జరిగిన విద్యాసదస్సులో విశ్రాంత గ్రూప్‌వన్ అధికారి జుత్తు తాతారావు, వైద్యులు డాక్టర్ తెప్పల ఆనంద్, మానసిక వికాస నిపుణులు రాంబుడ్డి గణపతి, గ్రంథాలయ సంచాలకులు పుక్కళ్ల చిరంజీవి విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. ప్రతిభా పరీక్షలో వంకల చరిష్మా, వంకల సుస్మిత, సాలిన రాహుల్ ప్రథమ, ద్వితీయ, తృతీయ వరుసస్థానాల్లో నిలిచారు. జె.ఇందు, ఆసిస్, అనురాధ, పవన్, సమీక్ష, హార్దిక, గుణశేఖర్‌లు ప్రోత్సాహక బహుమతులను గెలుపొందారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బొడ్డ చిన్నారావు, కన్వీనర్ కుత్తుం ప్రకాశరావు, బత్తిని ఓంకార్, రెయ్యి కృష్ణారావు, డాక్టర్ లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

చింతామణి ట్రస్టు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి- కవిటి

ఆర్థిక సమస్యలతో చదువుకు ఇబ్బంది పడుతున్న వారికి అండగా నిలిచి, ఎంతోమంది విద్యార్థుల చదువుకు చేయూత అందిస్తున్న చింతామణి అమ్మవారి ట్రస్ట్ సేవలు(ఇందిరాదేవి, చింతామణి కుమార్ హైదరాబాద్ వారి సహకారంతో) అభినందనీయమని సర్పంచ్ పూడి లక్ష్మణరావు కొనియాడారు. గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థి పొల్లాయి జస్వంత్‌కు ఇంటర్మీడియట్ చదువు నిమిత్తం విద్యార్థి తల్లికి రూ.50వేలు పెద్దల సమక్షంలో ఆదివారం అందించారు. కార్యక్రమంలో ఉషోదయ యువజన సంఘం అధ్యక్షుడు పాండవ శేఖర్, మాజీ సర్పంచ్‌లు ఆరంగి మధు, బెందాలం వెంకటేశ్వరరావు, ఆగ్నికుల క్షత్రియ సంఘం నాయకుడు పొల్లాయి లక్ష్మణమూర్తి, ఆరంగి రాజు, బావన రవి, జన్ని లోకనాథం, బాలక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

బారువ తీరంలో పిక్నిక్ సందడి

ప్రజాశక్తి- సోంపేట

మండల పరిధిలో బారువ సముద్ర తీరం ఆదివారం యాత్రికులతో సందడిగా మారింది. ఉదయం నుంచి పరిసరప్రాంత వాసులు కుటుంబాలతో సహ తీరానికి చేరుకున్నారు. మధ్యాహ్నం భోజనాలు చేసి సాయంత్రం సముద్ర స్నానాలను ఆచరించారు. సుమారు 2వేల మంది వరకు యాత్రికులు తీరాన్ని సందర్శించినట్లు మెరైన్ సిఐ రమేష్ కుమార్ తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. బందోబస్తులో ఎస్ఐ శ్రీనివాస్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

ఘనంగా వినియోగదారుల దినోత్సవం

పర్లాకిమిడి: గజపతి జిల్లా పర్లాకిమిడి పట్టణంలో యుటెక్ ఇన్స్టిట్యూట్‌లో వినియోగదారుల రైట్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నేషనల్ కంజ్యూమర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచిత్రానంద బేవర్త అతిధిగా వచ్చారు. ఈ కార్యక్రమంలో కంజుమర్స్ రైట్స్ ప్రొటెక్షన్ జిల్లా కార్యదర్శి రొక్కం లోకనాధం, కోశాధికారి శిశిర కుమార్ బాంజ సామంతా, ఉపాధ్యక్షులు తనూజ శతపతి, సహాయ కార్యదర్శి లింగరాజ్ పానీగ్రాహి, పర్లాకిమిడి పట్టణ అధ్యక్షులు భాగవత్ పాఢీ, గుసాని సమితి కోశాధికారి ముచ్చి బంగారు, యుటెక్ ఇన్స్టిట్యూట్ ఇన్‌ఛార్జి లోకనాథ్ మిశ్రా, జమానా క్రయ్య మాస్టర్, ప్రియాంక దాస్, మానసి పండా, ప్రశాంత్ కుమార్ నాయక్, మీనా కుమారి సాహు, సాయి అంకిత సాహు, అంకిత పండా, భన్వా రౌత్ రాహి భూయా పాల్గొన్నారు. ప్రధానంగా కిరాణా దుకాణాల్లో జరుగుతున్న మోసాలు, గ్యాస్, విద్యుత్ వినియోగదారుల హక్కుల కోసం చర్చ జరిగింది.

పోర్టు వాహనాలతో బెంబేలు

కోటబొమ్మాళి: మండలం మూలపేట పోర్టు నిర్మాణానికి సంబంధించి భారీ వాహనాలతో కోటబొమ్మాళి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇసుక, మెటల్, రాళ్లలోడ్లుతో జనావాసాల వద్ద అధిక లోడ్లు, వేగం తగ్గకుండా వెళ్ళడంతో చిన్నారులు, విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ వాహనాలు వెనుక దుమ్ముధూళి అధికంగా రావడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. పోర్టు వాహనాలు అధిక స్పీడ్‌తో వెళ్లడంతో మెటల్, రాళ్లు దారిలో తుళ్లిపడుతుండడంతో వెనుక వచ్చిన ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రాళ్లు ఎప్పుడు ఎవరిమీద పడుతాయేయని, భారీ వాహనాలు వల్ల రోడ్లు కూడా ధ్వంసం అయ్యాయని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గతంలో రాత్రి వేళ పెద్ద బండరాళ్లు మెయిన్‌రోడ్డులో పడడం వల్ల త్రుటిలో ప్రమాదం తప్పింది. ఇదే పరిస్థితి పునరావృతమయ్యే ప్రమాదం లేకపోలేదని అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిత్యం జనవాహాలతో నిండి ఉన్న కోటబొమ్మాళి రహదారిలో కాకుండా వేరే మార్గంలో మళ్లించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై అతివేగంగా దూసుకువస్తున్న పోర్టువాహనం

అంతర్రాష్ట్ర సర్వీస్‌లు ప్రారంభం

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి ఆర్‌టిసి డిపోనుంచి అంతర్రాష్ట్ర సర్వీస్ బస్‌సౌకర్యం కల్పించబడుతుందని డిపో మేనేజర్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. టెక్కలి డిపో నుంచి పర్లాకిమిడి, గునుపూర్‌కు బస్సుల సౌకర్యం ఉందన్నారు. విశాఖపట్నం మీదుగా సర్వీస్‌లు నడిపిస్తున్నామని తెలిపారు. వీటిని ప్రయాణికులు వినియోగించుకోవాలని మేనేజర్ శ్రీనివాసరావు కోరారు.

పద్యాలు పాడుతున్న లక్ష్మీప్రసన్న

గ్రంథాలయంలో చదవడం మాకిష్టం

ప్రజాశక్తి- లావేరు

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం జరుగుతుందని, దీనిని విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. విద్యార్థి లక్ష్మీ ప్రసన్న పద్యాలు పాడుతూ పద్మవ్యూహంలో అభిమన్యుని పాత్రపై తెలియజేశారు. గ్రంథాలయం తరుపున బహుమతులను అందజేశారు. కార్యక్రమములో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రదర్శనలు చేస్తున్న సోంపేట కళాకారులు

హైదరాబాద్‌లో కళాకారుల ప్రదర్శన

ప్రజాశక్తి- సోంపేట

పట్టణానికి చెందిన శ్రీ నటరాజ నాట్యమండలి చిన్నారులు ఆదివారం హైదరాబాద్‌లో సాంస్కృతిక ప్రదర్శన ఇచ్చారు. హైదరాబాద్‌లో గచ్చిబౌలి స్టేడియంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో చోటుకోసం చిన్నారులు ఈ ప్రదర్శన నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. సోంపేటకు చెందిన సాత్విక, శ్రీలక్ష్మి, స్వాతి, శృతిపోసిని, తప్పి, ద్రాక్షాయణి, స్నేహ, అశ్రిత, జాహ్నవి, వర్షిక పాల్గొని ప్రదర్శనలు ఇచ్చారు.

విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి- బూర్జ

మండల కేంద్రంలో జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆదివారం విద్యార్థుల ఆత్మీయ కలయిక అత్యంత ఉల్లాసభరితంగా జరిగింది. 1999-2000 సంవత్సరంలో ఈ పాఠశాలలో 10వ తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు రెండు దశాబ్దాలు తర్వాత కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దీంతో 23 ఏళ్ల తర్వాత చిన్ననాటి స్నేహితులు కలుసుకున్నారు. ఇదే పాఠశాలలో చదువుకుని అభివృద్ధి చెందామని పాఠశాల అభివృద్ధి కోసం తమవంతు కృషి చేస్తామని నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతి కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అనంతరం అప్పటి పాఠశాల ఉపాధ్యాయులను విద్యార్థులు సత్కరించారు.

చిన్ననాటి మిత్రులను కలుసుకున్న పూర్వపు విద్యార్థులు